

నేటి రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా వాసుల ఆశలు

ఓరుగల్లుకు వరాలిచ్చేనా?



- సాగునీటి పథకాలకు ప్రాధాన్యం కోసం ఎదురుచూపు
- దేవాదుల సహా చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులకు నిధులిచ్చే అవకాశం
- కాంగ్రెస్ సర్కారు తొలి పద్దుపై ప్రజల్లో ఆసక్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రాష్ట్ర ఆవిర్భావం జరిగిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టబోతున్న తొలిబడ్జెట్‌పై ఓరుగల్లు వాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. వరంగల్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పర్యటించటంతో పాటు ఉమ్మడిజిల్లా, వరంగల్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధికి సంబంధించి అనేక హామీలు ఇచ్చారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు గురువారం డిప్యూటీసీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో వరాలు కురిపిస్తారని, ఫలితంగా వరంగల్ మహానగరంతో పాటు మారుమూల ప్రాంతాలు అభివృద్ధిలో పరుగులు పెడతాయన్న ఆశతో ఉన్నారు. ఇక ఉమ్మడి వరంగల్ నుంచి 11మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండటం.. వారిలో కొండా సురేఖ, ధనసరి సీతక్క మంత్రులుగా ఉన్న నేపథ్యంలో ఉమ్మడిజిల్లాకు ప్రాధాన్యం దక్కుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో అభివృద్ధికి కావాల్సిన నిధులపై ప్రభుత్వానికి నివేదికలు కూడా ఇచ్చారు. దీంతో బడ్జెట్‌లో పరిశ్రమలు, విద్యాభివృద్ధి కార్యక్రమాలతో పాటు సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం దక్కబోతోందని ఎదురుచూస్తున్నారు.

ప్రత్యేక ప్యాకేజీపై భారీ ఆశలు



ఈ బడ్జెట్‌లో వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తుందనే ఆశతో ప్రజలున్నారు. 2016-17లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్‌కు ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.250కోట్లు కేటాయించింది. ఈ నిధులతో నగరంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రతి ఏటా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం ఆ తరువాత చేతులెత్తేసింది. హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను తీర్చిదిద్దాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో వరంగల్‌కు ప్రత్యేక ప్యాకేజీ దక్కుతుందని భావిస్తున్నారు.

నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీపై ఆశలు..

వరంగల్ నగర వాసులు ఎన్నో ఏళ్లగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డ్రెయినేజీ. నాలాలన్నీ ఆక్రమణలకు గురి కావటంతో నగరంలో మురుగునీరు కాలనీలను ముంచెత్తుతోంది. వర్షాకాలమైతే కాలనీలన్నీ చెరువులను తలపిస్తాయి. 10లక్షలకు పైగా జనాభా, 1,500లకు పైగా కాలనీలు ఉన్నా మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో ఏటా వానాకాలంలో లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయి. భారీ నిర్మాణాలతో నగరం కాంక్రీట్ జంగల్‌గా మారిపోగా.. అడ్డదిడ్డంగా నిర్మించిన ఇళ్లతో నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవటంతో కష్టాలు తప్పటం లేదు. ఈ కష్టాలకు చెక్‌పెట్టేందుకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని నిర్మిస్తామని పార్లమెంట్ ఎన్నికల సమ యంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన వరంగల్ అభివృద్ధి సమీక్షలోనూ చర్చించిన ఆయన డీపీఆర్‌ను రూపొందించి పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో సుమారు రూ.2వేల కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయని, దీంతో ఈ బడ్జెట్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి నిధులు వస్తాయన్న ఆశతో నగరవాసులున్నారు.

లెదర్ పార్కుకు నిధులొచ్చేనా?



చర్మకారులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ కేంద్రంలోని శివునిపల్లిలో 117 ఎకరాల్లో రూ.275కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో లెదర్ పార్కును నిర్మించాలని ప్రతిపాదనలు చేసినా అవి అటకెక్కడంతో 2002లో టీడీపీ ప్రభుత్వం 25ఎకరాల్లో మినీ లెదర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేసి.. సుమారు రూ.10కోట్ల నిధులు కేటాయించారు. తొలి విడతలో స్థానికంగా ఆసక్తి ఉన్న 50మందికి చెన్నై లో చెప్పులు తయారు చేయటం, లెదర్ బ్యాగులు, ఇతర లెదర్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ కూడా ఇప్పించారు. 2003 లో రూ.10లక్షలతో లెదర్ పరిశ్రమ కోసం ఓ భవనం కూడా నిర్మించారు. మరో రెండు విడతల్లో 120మందికిపైగా శిక్షణ ఇచ్చా రు. అయినా ఇప్పటి వరకు లెదర్ పార్కుకు మోక్షం లేదు. ఇటీవల స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి లెదర్ పార్కు అభివృద్ధిపై సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ బడ్జెట్‌లో లెదర్ పార్కుకు మోక్షం లభిస్తుందనే ఆశతో స్థానికులున్నారు.

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు..

వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట శివారులో 1,350 ఎకరాల్లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ) పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు లక్షమందికి పైగా ఉపాధి అవకాశాలు లభించేవి. ప్రభుత్వంతో 22కంపెనీలు ఒ ప్పందం కుదుర్చుకున్నప్పటికి కేవలం మూడు కంపెనీలు మాత్రమే ప్రస్తుతం ఉత్పత్తి ప్రారంభించాయి. అయితే 18 మార్చి 2023న కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం మిత్ర పథకంలో వరంగల్ టెక్స్‌టైల్ పార్కును చేర్చేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేయ టం లేదు. కేంద్ర బడ్జెట్‌లో కూడా ఎలాంటి నిధులు కేటాయించలేదు. గత నెల 29న వరంగల్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ పార్కును సందర్శించారు. ఆయన ఇచ్చిన ఆదేశాలతో అధికారులు కొత్త పరిశ్రమల ఏర్పాటుకు సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర బడ్జెట్‌లో కేఎంటీపీకి భారీగా నిధులు కేటాయిస్తారనే ఆశతో ఓరుగల్లువాసులున్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం..

ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు కసరత్తు చేసిందని, రూ.1,000కోట్ల లోపు బడ్జెట్‌తో పూర్తి అయ్యే ప్రాజెక్టులను గుర్తించి 2025 మార్చిలోపు వాటిని పూర్తి చేయాలని నిర్ణయానికి వచ్చిందని సమాచారం. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని దేవాదుల ప్రాజె క్టుకు తొలి ప్రాధాన్యమి వ్వాలని భావిస్తోంది. ఇప్పటికే ఫేస్-1, ఫేస్-2 పనులు పూర్తవగా

మిగతా 7వ పేజీలో..

చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా శ్వేత



మార్కెట్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్వేత

బచ్చన్నపేట, జూలై 24: చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమి టీ చైర్‌పర్సన్‌గా బచ్చన్నపేట మండలం కట్కూరు గ్రామానికి చెందిన నల్లనాగుల శ్వేత బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. చేర్యాల మార్కెట్ లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి బచ్చన్నపేట మండలం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ముఖ్య అతిథిగా జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా పలు గ్రామాల్లో నాయకులు టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం గ్రామానికి వచ్చిన శ్వేత మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తానన్నారు. మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు తోడ్పాటు అందించాలని కోరారు. రైతుల సంక్షేమమే తమ ప్రథమ కర్తవ్యమని అన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించండి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



కేశిరెడ్డిపల్లి పాఠశాలలో మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

బచ్చన్నపేట, జూలై 24: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కేశిరెడ్డిపల్లి, పడమటికేశ్వాపూర్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను బాగుచేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కేశిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించి పలు సూచనలు చేశారు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేలా చూడాలని టీచర్‌ను ఆదేశించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా ఆయా పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురామకృష్ణ, నోడల్ ఆఫీసర్ వెంకటరెడ్డి, కార్యదర్శి అనిల్‌రాజ్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో డీఏవో వినోద్‌కుమార్ అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీ చేశారు.

రఘునాథపల్లి జీపీలో విచారణ..

రఘునాథపల్లి: రఘునాథపల్లి గ్రామ పంచాయతీలో గత పాలకవర్గం నిధుల దుర్వినియోగం చేసిందని, ఈ విషయంలో విచారణ జరిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాదర్బార్‌లో కొందరు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ బుధవారం గ్రామపంచాయతీలో విచారణ చేపట్టారు. గ్రామస్థులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. విచారణ అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో పార్థసారథి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ పూరం యుగేందర్, ఎంపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధితో మహిళలకు గౌరవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెయ్యి మందికి కుట్టు మిషన్ల పంపిణీ

జనగామ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సమాజంలో మరింత గౌరవం పెరుగుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న లింగాలఘణపురం మండలానికి చెందిన 1000 మంది మహిళలకు కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. జనగామ మండలం యశ్వంతాపూర్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. శిక్షణ పొందిన మహిళలకు ప్రభుత్వపరమైన దుస్తులు కుట్టే ఆర్డర్లను ఇప్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్, కేసీఆర్ హయాంలోనే మహిళా సాధికారత సాధ్యమైందని గుర్తుచేశారు. సమాజంలో మహిళల పట్ల అందుతున్న గౌరవంలో ఏ విధంగా మార్పు వచ్చిందో ఆలోచన చేయాలన్నారు. కేసీఆర్ వచ్చాక గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను చేయించి బాలింతలను ప్రభుత్వ వాహనాల్లో ఇంటి వద్ద దింపి వచ్చేలా చేశారన్నారు. ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. మహిళలకు రూ. 2500 హామీ ఏమైందని నిలదీశారు. రుణమాఫీ పేరుతో రైతుల చెవుల్లో రేవంత్‌రెడ్డి పువ్వులు పెడుతున్నారని విమర్శించారు. రైతుబంధు కింద ఇవ్వాల్సిన రూ. 6 వేల కోట్లను దారి మళ్లించి కొంత మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని దుయ్యబట్టారు. గ్రామాల్లో తిరిగే తుపాకీ వెంకట్రాముడిలా కొందరు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

ఓట్ల కోసమో.. రాజకీయాల కోసమో కాదు..

- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

ఓట్ల కోసమో, రాజకీయాల కోసమో, తాను ఎమ్మెల్యే అవ్వడానికో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ ఇప్పించలేదని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మహిళలు స్వయంగా తమ కాళ్ల మీద తాము నిలబడగలిగేందుకే ఈ శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో కుట్టు మిషన్లను పంపిణీ చేయరని చాలా మంది భావించారని, కానీ తాను మాత్రం మాట మీద నిలబడి కుట్టు మిషన్లను అందిస్తున్నానని తెలిపారు. ఇంతటితో తన బాధ్యత తీరిపోలేదని, శిక్షణ పొందిన మహిళలందరికీ పలు కంపెనీల ద్వారా పని కల్పించేలా చూస్తానని హామీ ఇచ్చారు. నెలకు రూ. 20 వేల చొప్పున ఉపాధి అందేలా ప్రయత్నం చేస్తానని అన్నారు. అనంతరం కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీ, నాయకులు బస్వగాని శ్రీనివాస్, లింగాలఘనపురం మండలానికి చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు పొందిన మహిళలు

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

రైతులు దృష్టి సారించాలి: కలెక్టర్ రిజ్వాన్‌బాషా



వనపర్తిలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

లింగాలఘణపురం, జూలై24: ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, రైతులు ఈ తోటలపై దృష్టి సారించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగు లక్ష్యం 3వేల ఎకరాలుగా నిర్దేశించామని, ఇప్పటికే 440 ఎకరాల్లో సాగవుతోందని వివరించారు. బుధవారం ఆయన లింగాలఘణపురం మండలం వనపర్తి గ్రామంలో ఆయిల్ పామ్ తోటలను సందర్శించారు. సంబంధిత రైతులతో మాట్లాడారు. సాగు విధానం, అనుసరిస్తున్న పద్ధతులు, రైతుల అనుభవాలను తెల్సుకున్నారు. ఈ సందర్భంగా రైతులు నితీష్‌రావు, రేణుక, రాములు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు విధానం బాగుందని, అంతరపంటలు కూడా సాగుచేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీలను అందిస్తోందన్నారు. 80-100 శాతం డ్రిప్ పరికరాలు, మొక్కలపై రాయితీ లభిస్తుందని సూచించారు. ఇందులో అధిక లాభాలు వస్తాయని అన్నారు. అంతకుముందు వనపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను పర్యవేక్షించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, వంటశాలల్లో శుచిశుభ్రతను పాటించాలని అన్నారు. అంగన్‌వాడి చిన్నారులకు మెనూప్రకారం పోషకాహారం అందించాలన్నారు. కలెక్టర్ వెంట డీఈవో రాము, జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి కేఆర్ లత, డీడబ్ల్యూవో జయంతి, తహసిల్దార్ వినయలత, నోడల్ అధికారి విష్ణుమూర్తి, ఏవో వెంకటేశ్వర్లు, ఆర్ఐ కిషోర్ ఉన్నారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్..

లింగాలఘణపురం మండలంలోని వనపర్తి ఎస్సీ కాలనీకి చెందిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఏ.శ్రీదేవి(ఎస్‌జీటీ)ని సస్పెన్షన్ చేయాలంటూ కలెక్టర్ రిజ్వాన్ బాషా డీఈవోను ఆదేశించారు. బుధవారం పాఠశాలలను తనిఖీ చేసిన ఆయన ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించారు. శ్రీదేవి అనే ఉపాధ్యాయురాలు అనుమతులు లేకుండా నాలుగు మాసాలుగా పాఠశాలకు గైర్హాజర్ కావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించడమే కాకుండా అక్కడే పనిచేసే మరో ఉపాధ్యాయుడికి బాధ్యతలు అప్పగించకుండా నిర్లక్ష్యం చేసినందుకు వెంటనే సస్పెన్షన్ ఉత్తర్వులను జారీ చేయాలని డీఈవో రామును ఆదేశించారు.

రేపు మేడిగడ్డకు బీఆర్ఎస్ బృందం

- కేటీఆర్, హరీశ్‌రావు సహా ఎమ్మెల్యేలు, నాయకుల పర్యటన

వివరాలు 8వ పేజీలో..

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్ జూలై 24: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో కోరారు. మామునూర్ నవోదయ విద్యాలయంలో 6 వ తరగతి ఎంపిక పరీక్షకు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత పరీక్ష 2025 జనవరి 18న ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు జేఎన్‌వీవరంగల్. గొవ్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఇతర వివరాలకు 0870-2556373 నంబరులో సంప్రదించాలని సూచించారు.

'ఎదుగుదలను ఓర్వలేకే కుట్రలు'

వరంగల్ కార్పొరేషన్, జూలై 24 : సీపీఎం పార్టీలో తన ఎదుగుదలను ఓర్చుకోలేక కొందరు కాంగ్రెస్ పార్టీ కింది స్థాయి నాయకులు కుట్రలు చేస్తూ తమ కాలనీలలో కొందరిని పార్టీలో చేర్చుకుని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గ్రేటర్ 2వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద మల్లేశం అన్నారు. బుధవారం భగత్‌సింగ్ కాలనీలో స్థానిక సీపీఎం కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

ఆయిల్‌పామ్ సాగుకు ఎంతో భవిష్యత్తు

భద్రాద్రి జిల్లా స్ఫూర్తితో ఇతర జిల్లాల్లో విస్తరణ : ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

అశ్వారావుపేట, జూలై 24: రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పామాయిల్ సాగును రికార్డు స్థాయిలో చేయడం ద్వారా హబ్‌గా మారిందని ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ప్రశంసించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట, దమ్మపేట పామాయిల్ ఫ్యాక్టరీలను సందర్శించారు. ఆయా ఫ్యాక్టరీలు పనిచేసే విధానం, క్రషింగ్, ఆయిల్ రికవరీ, ఫ్యాక్టరీల కండీషన్, ఉప ఉత్పత్తులు, ఇతర సాంకేతిక వివరాలను ఆయిల్‌ఫెడ్ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా ఆయిల్‌పామ్ సాగు అనుభవాలతో వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ జరగాల్సి ఉందని అన్నారు.

ఆయిల్‌పామ్ తూకం వేసే వే బ్రిడ్జి వద్ద, ఆన్‌లైన్ బిల్లు ప్రాసెస్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మోసాలకు తావులేకుండా చూడాలని కోరారు. దేశానికి ఏడాది కోటి టన్నుల పామాయిల్ అవసరం వుందని, కానీ మూడు లక్షల టన్నులే అందు బాటులో వుందని మిగతాది మలేషియా, ఇండోనేషియా వంటి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్టు రాఘ వరెడ్డి తెలిపారు. ఆయి లోఫెడ్ అధికారులు నిరం తరం రైతులకు అందు బాటులో ఉండి వారి సందేహాలు తీర్చాలని సూచించారు. తెలంగాణలోని భూములు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నందున ఆయిల్‌ఫెడ్ ద్వారా రైతులు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అనంతరం నారవారిగూడెంలోని ఆయిల్‌ఫెడ్ డివిజన్ కార్యాలయం, నర్సరీలను సందర్శించారు. రాయితీలు వస్తున్నాయా? ఈ ఏడాది ఎన్ని ఎకరాల్లో మొక్కలు వేశారనే విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ పి.సుధాకరరెడ్డి, డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ పాల్గొన్నారు.



ఫ్యాక్టరీని సందర్శించిన జంగా రాఘవరెడ్డి, అధికారులు

పెద్దమ్మతల్లి దేవాలయంలో చోరీ

అమ్మవారి అభరణాలు ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు

ధర్మసాగర్, జూలై 24: పెద్దమ్మతల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన పెద్ద పెద్యాలలో జరిగింది. ధర్మసాగర్ సీఐ మహేందర్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపెండ్యాలలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిట్టల ఆశోక్ రోజూ మాదిరిగా పెద్దమ్మ తల్లి గుడిని శుభ్రం చేసి మంగళవారం రాత్రి 8.30 గంటలకు తాళం చేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు ఆశోక్ వద్ద నుంచి గుడికి సంబంధించిన తాళాన్ని తీసుకుని గుడి వద్దకు వెళ్లి చూసే సరికి గుడి ఇనుపగేట్‌కు వేసిన తాళం పగులగొట్టి ఉంది. దీంతో వెంకటేశ్వర్లు విషయాన్ని ఆశోక్‌కు చెప్పడంతో గుడిలోనికి వెళ్లి చూడగా అమ్మ వారి మెడలో గల రెండు బంగారు పుస్తెలు, ముక్కు పుడుక, నాలుగు వెండి మట్టెలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు 67,400 వరకు ఉంటుందన్నారు. సంఘటనా స్థలాన్ని కాజీపేట ఏసీపీ తిరుమల్‌రావు, సీఐ మహేందర్‌లు సందర్శించి వివరాలను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల ప్రతిష్టను పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులదే : డీఈవో

ఐనవోలు, జూలై 24: ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టను పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని హనుమకొండ డీఈవో వాసంతి అన్నారు. ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు ఏలా ఉంది, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పుస్తకాల వివరాలను, మధ్యా హ్నం భోజనం మెనూ ప్రకారం పంపిణీ చేస్తున్నారా, ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి లక్ష్యం, కార్యక్రమాల ద్వారా విద్యార్థులతో కనీన అభ్యసన సామార్థ్యాలు ఎంత మేరకు వృద్ధి చెందాయి లాంటి విషయాలు హెచ్ఎం ప్రతాప్‌రత్నకుమార్‌ని అడిగితెలుసుకున్నారు. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని చెప్పడంతో ప్రస్తుతానికి కావాల్సిన ఉపాధ్యాయులను వెంటనే నియమిస్తామని డీఈవో హామీ ఇచ్చారు. గడిచిన సంవత్సరాల్లో 10వ తరగతి 100శాతం ఫలితాలు సాధించడంతోపాటు, ఎన్ఎంఎంఎస్ లాంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించడం గొప్ప విషయమన్నారు. ఈ పాఠశాలలో అందరు ఎస్జీటీ ఉపాధ్యాయులైనప్పటికీ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉపాధ్యాయుల బోధన బాగుందని కొనియాడారు.

గుర్తింపు సరే.. అభివృద్ధి ఏదీ?



సోమసూత్రం పని చేయకపోవడంతో నీటిని బిందెలతో బయటకు పంపిస్తున్న దృశ్యం (ఫైల్)

వర్షానికి తడుస్తున్న నందీశ్వరుడు

సక్షాసన ప్రదేశంలో పడుతున్న వాన నీరు



రామప్ప దేవాలయం

- అరుదైన ఖ్యాతి గడించి మూడేళ్లయినా మారని రామప్ప పరిస్థితి
- ప్రత్యేక దృష్టి పెట్టాలంటున్న పర్యాటకులు
- రామప్పకు యునెస్కో గుర్తింపు దక్కి మూడేళ్లు

యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ సంపదపై చిన్నచూపు

వెంకటాపూర్(రామప్ప), జూలై 24: కాకతీయ కళా వైభవానికి ప్రతీకగా నిలిచి.. ప్రపంచ వారసత్వ సంపదగా వరల్డ్ హెరిటేజ్ కమిటీ (యునెస్కో) గుర్తింపు సాధించిన ములుగు జిల్లాలోని రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయం అభివృద్ధిలో వెనుబాటుకు గురవుతూనే ఉంది. అరుదైన ఖ్యాతి గడించి మూడేళ్లయినా దేవాలయ పరిస్థితిలో మాత్రం మార్పు రాలేదు. 2021 జూలై 25న ప్రపంచ వారసత్వ సంపదగా వరల్డ్ హెరిటేజ్ కమిటీ రామప్పను గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా 42 వారసత్వ కట్టడాలు యునెస్కో పరిశీలనకు ఎంపిక కాగా మన దేశం నుంచి 2020 సంవత్సరానికి రామప్పకు మాత్రమే ఈ ఖ్యాతి దక్కింది. తెలుగు రాష్ట్రాల్లో వారసత్వ గుర్తింపు పొందిన తొలి కట్టడంగా రామప్ప రికార్డు సృష్టించింది. చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, జలపాతాలు క్రీస్తుపూర్వం నుంచి తెలంగాణలో ఎన్నో ఉన్నా యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ సంపద జాబితాలో తెలంగాణ రాష్ట్రం నుంచి రామప్ప 39వ ప్రపంచ వారసత్వ కట్టడంగా ఎంపికైంది. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చి మూడేళ్లలో జరిగిన అభివృద్ధి, ఇంకా చేయాల్సిన పనులపై ప్రత్యేక కథనం...

భారతదేశంలో సుమారు 3,600 చారిత్రక కట్టడాలు ఉన్నాయి. అంతర్జాతీయ సంస్థ (యునెస్కో) ఈ తరహా కట్టడాలకు గుర్తింపునిస్తోంది. 2021 వరకు రామప్ప సహా 39 కట్టడాలకు మాత్రమే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఇచ్చారు. యునెస్కో గుర్తింపు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు రామప్ప పరిరక్షణ కమిటీ తీవ్రంగా కృషి చేసింది. ఈ క్రమంలో 2017లో తొలి డోజర్‌ను ప్యారిస్‌లోని యునెస్కో కార్యాలయానికి పంపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కాకతీయ హెరిటేజ్ సైట్ హైదరాబాద్‌కు చెందిన సీనియర్ ఆర్కిటెక్ సూర్యనారాయణమూర్తితో తయారు చేయించి అప్పటి కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ ఆఫ్ జనరల్ (డీజీ) విద్యావతి ఆధ్వర్యంలో పంపించారు. దీని ఆధారంగా 27 డిసెంబరు 2019లో థాయిలాండ్ దేశానికి చెందిన యునెస్కో ప్రతినిధి వాసుపోశ్యా నందన సందర్శించారు. వరుసగా రెండు రోజులు రామప్పలో మకాం వేసి రామప్ప యునెస్కో గుర్తింపు ఎంపికకు కావాల్సిన సూచనలు తయారు చేస ప్రగతి నివేదికను ప్యారిస్‌లోని యునెస్కో కార్యాలయంలో సమర్పించారు. అప్పటి నుంచి రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చిందనే ఆశతో రామప్పలో సంబరాలు జరుపుకున్నారు.

యునెస్కో ప్రతినిధి ఇచ్చిన సూచనలు ఇవే...

రామప్పకు యునెస్కో గుర్తింపు రావడానికి వాసుపోశ్యానందన పలు సూచనలు చేశారు. రామప్ప ప్రధాన ఆలయానికి సమీపంలో ఉన్న కామేశ్వరాలయాన్ని పునర్నిర్మాణం చేయాలని, ఆలాగే ప్రధాన ఆలయం చుట్టుపక్కల ఉన్న గోల్లాలగుడి, శివాలయాలను ఒకే కాంప్లెక్స్‌లో ఉండేలా తయారు చేయాలని సూచించారు. అలాగే 100 మీటర్ల దూరం వరకు కోర్ ఏరియాగా గుర్తించాలని, 101 నుంచి 200 మీటర్ల వరకు క్రమబద్ధీకరించి పర్యాటకులను ఆకర్షించేలా కట్టడాలు నిర్మించాలని అన్నారు. అంతే కాకుండా 201 నుంచి 500 మీటర్ల వరకు బఫర్‌జోన్ ఏర్పాటు చేసి పాలంపేట స్పెషల్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.

రాష్ట్రపతి రాక..

రాష్ట్రపతి ద్రౌపదిముర్ము 2022 డిసెంబర్ 29న తొలిసారిగా రామప్ప ఆలయాన్ని సందర్శించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, అప్పటి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, ప్రస్తుత గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, అప్పటి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా పర్యటించారు. అంతేకాకుండా అప్పటి సుప్రీంకోర్టు జడ్జి రమణ రామప్ప కళా సంపదను చూసి అబ్బురపడ్డారు. అప్పటి రాష్ట్ర మంత్రి కేటీఆర్ కూడా రామప్పను సందర్శించారు. గతేడాదిలో కాంగ్రెస్‌పార్టీ రోడ్‌షోలో భాగంగా కాంగ్రెస్‌పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ కూడా రామప్పను సందర్శించి ప్రశంసించారు. యునెస్కో గుర్తింపుతో మారుమూల పల్లె పాలంపేట అంతర్జాతీయ స్థాయిలో చోటు సంపాదించుకోవడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

ప్రపంచ గుర్తింపు వచ్చాక...

రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చాక రూ.11కోట్లతో కామేశ్వర ఆలయం పునర్నిర్మాణం చేయాలని ఆదేశాలు వచ్చాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు సాగడంలేదు. రూ.25లక్షలతో గార్డెన్ సుందరీకరణ, రూ.30లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం, రూ.2కోట్లతో మౌలిక వసతులు, అంతర్జాతీయస్థాయి మరుగుదొడ్ల నిర్మాణం, దివ్యాంగుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు, చంటి పిల్లల కోసం ప్రత్యేక వసతులు, సోలార్ లైట్ల ఏర్పాటు, క్యాంటీన్ల ఏర్పాటు, సూచిక బోర్డుల ఏర్పాటు, చెవిటి,మూగ వారి కోసం క్యూఆర్ కోడ్‌ల ఏర్పాటు, 2018లో తూర్పు ప్రాకార గోడ కూలిపోవడంతో రూ.40లక్షలతో తూర్పు ప్రాకార గోడ పునర్నిర్మాణం చేశారు. రూ. 35లక్షలతో దక్షిణ ప్రాకారగోడ కూలడానికి సిద్ధంగా ఉండటంతో 2022 డిసెంబరులో తొలగించి 2023లో పునర్నిర్మాణం చేశారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దృష్టిలో ఉంచుకుని రామప్ప ఆలయం చుట్టూ మూడు రంగుల జెండాతో కూడిన ఎల్ఈడీ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఆలాగే నార్త్, ఈస్ట్ ప్రాకారగోడల నిర్మాణం కోసం రూ.35 లక్షలతో టెండర్ పిలువగా టెండర్ దక్కించుకున్న వ్యక్తి రాకపోవడంతో ఆ పనులు పూర్తికాలేదు.

ప్రసాద్ స్కీంలో రూ.62కోట్లతో పనులు

ప్రపంచ వారసత్వ సంపద అయిన సుప్రసిద్ధ రామప్ప దేవాలయానికి తూర్పుముఖ ద్వారం సమీపంలో ప్రసాద్‌స్కీం కింద రూ. 62కోట్లతో 22-12-2022లో నిధులు మంజూరు కాగా, అదే నెల 29న భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, అప్పటి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్, స్థానిక ఎమ్మెల్యే ప్రస్తుత మంత్రి ధనసరి సీతక్కతో కలిసి రామప్పను సందర్శించారు. అనంతరం ప్రసాద్‌స్కీంలో వచ్చిన పనులకు రాష్ట్రపతి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఆ పనులు కొనసాగుతున్నాయి. సైట్ ఏలో పదెకరాల్లో ఇంటర్‌పిటిషన్ సెంటర్ జీ1, ఫుడ్‌కోర్టు విత్ గ్లాస్, సావనీర్‌స్టాల్స్ విత్ ఆర్నమెంటల్, టాయిలెట్స్ బ్లాక్స్, సెక్యూరిటీ క్యాబిన్, కాంపౌండ్‌వాల్, ఆలాగే సైట్ బీలో 9 ఎకరాల్లో టికెట్ కౌంటర్, కాంపౌండ్ వాల్, గ్రావెల్ పిల్లింగ్స్, మినీథియేటర్ తదితర నిర్మాణాలు చేపడుతున్నారు. ఈనిర్మాణాలను 2024 డిసెంబరులోగా పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు టూరిజం అధికారులు తెలిపారు.

మూడేళ్లయినా అభివృద్ధి శూన్యం

ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు వచ్చి ఇప్పటికీ మూడు సంవత్సరాలైనా అభివృద్ధి మాత్రం జరగడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కామేశ్వరాలయం పునర్నిర్మాణం, ఉప ఆలయాలపై పట్టింపులేనితనం, తూర్పు ముఖ ద్వారం చీకటిమయం, సెంట్రల్ లైటింగ్ వెలుగులులేవు, శివలింగానికి చిలకరింపు అభిషేకాలే. సోమ సూత్రంపై నీలినీడలు, ఆలయం ఉరుస్తున్నా పట్టించుకోకపోవడం, నందీశ్వరుడిపై నీడలేదు, ఆలయం చుట్టూ సరిగా ఫెన్సింగ్ లేదు. సరస్సుపై మినీట్యాంక్‌బండ్ లేకపోవడం, కట్టపై ఉన్న ఉప ఆలయాలపై పట్టింపులేదు వంటి సమస్యలు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రానున్న రోజుల్లో రామప్పను అభివృద్ధి చేసి మరింత శోభాయమానంగా విరాజిల్లేలా అధికారులు చొరవ చూపాలని పర్యాటకులు, భక్తులు కోరుతున్నారు.

జేఎన్ఎస్‌ను సందర్శించిన 'సాట్' డైరెక్టర్



జేఎన్ఎస్‌లోని సింథటిక్‌ట్రాక్‌ను పరిశీలిస్తున్న సాట్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి

వరంగల్ స్పోర్ట్స్, జూలై 24 : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ఐఏఎస్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేడియంలోని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్‌ను పరిశీలించారు. అనంతరం జిల్లా క్రీడల అధికారి అశోక్‌కుమార్‌తో కలిసి హాస్టల్ నిర్వాహణ, మౌలిక వసతులతో పాటు ఇతర క్రీడా అంశాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం తరువాత పెద్ద నగరంగా పేరు గాంచిన హనుమకొండలో అతి పెద్ద స్టేడియం ఉందని, ఇక్కడ సీనియర్ కోచ్‌లో అందుబాటులో ఉండడం అభినందనీయమన్నారు. అదే విధంగా రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ఉండే బాల బాలికలకు నూతన వసతి గృహం నిర్మాణంతో పాటు క్రీడా వసతులకు గాను రూ. 14 కోట్ల నిధులను అందించాలని సాట్‌కు ప్రతి పాదనలు పంపించామన్నారు. అంతకు ముందు వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగస్టు 1న మానుకోటకు 'వాల్యూగోల్డ్'

- రాష్ట్రంలోనే మొట్టమొదటి బంగారం కొనుగోలు వాహనం



వరంగల్‌లో వాల్యూగోల్డ్ ప్రచారంలో పాల్గొన్న గంగవ్వ, సంస్థ ప్రతినిధులు

మహబూబాబాద్ టౌన్, జూలై 24 : మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి బంగారం కొనుగోలు చేసే వాహనం ఆగస్టు 1న రానున్నట్లు వాల్యూ గోల్డ్ సీఈవో భరద్వాజ్ పంపత్వార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా బంగారం కొనుగోలుచేసే వాహనం మానుకోటకు వస్తుందని పేర్కొన్నారు. తమ ఆర్థిక అవసరాల కోసం బం గారాన్ని అమ్మి డబ్బు కావాలనుకుంటున్నారో.. వారందరికి బంగారాన్ని సులభంగా అమ్మే అవకాశాన్ని వాల్యూగోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ కల్పిస్తోందని చెప్పారు. ప్రస్తుతం బంజారాహిల్స్, సికింద్రాబాద్, ఉప్పల్, కూకట్‌పల్లి, చింతల్‌లో వాల్యూగోల్డ్ బ్రాంచ్‌లు ఉన్నాయని చెప్పారు. ఈనెల 22 నుంచి 30 వరకు వరంగల్‌లో వాహనం తిరుగుతుం దని వివరించారు. బంగారాన్ని అమ్మదలిచిన వారు వాహనం వద్దకు తీసుకువచ్చి నాణ్యత పరీక్ష చేయించి బంగారంను కరిగించి దాన్ని విక్రయించి తక్షణమే నగదు పొందవచ్చని పేర్కొన్నారు. బంగారం కొనుగోలు ప్రక్రియ మొత్తం ఈ వాహనంలోనే చేస్తారని చెప్పారు. వాల్యూగోల్డ్ సేవలను మారుమూల ప్రాంతాలకు కూడ విస్తరింప చేయడం సంతోషంగా ఉందని సీఈవో భరద్వాజ్ పంపత్వార్ తెలిపారు.

ఓరుగల్లుకు వరాలిచ్చేనా?

5వ పేజీ తరవాయి

కీలకమైన మూడో విడత పనులు కూడా దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు రూ.13,911కోట్లు వరకు ప్రభుత్వం దేవాదుల కోసం ఖర్చు చేయగా మరో రూ.3,588కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. 3వేల ఎకరాలకు పైగా భూసేకరణ చేయాల్సి ఉండగా, ఇందులో 952ఎకరాలు పట్టణ ప్రాంతంలో ఉంది. దీంతో భూసేకరణతో సంబంధం లేకుండా కేవలం రూ.650కోట్లు కేటాయిస్తే మూడో విడత నీళ్లను ఎత్తిపోసుకునే వీలుందని ప్రభుత్వం ప్రాథమిక అంచనాకు వచ్చింది. ఈ మొత్తాన్ని ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించే అవకాశం ఉందని సమాచారం. అలాగే వర్ధన్నపేట, తొర్రూరు ప్రాంతాల భూములకు సాగునీరందించే ఎస్సారెస్పీ-2కు సంబంధించి పనులు పూర్తి చేసేందుకు రూ.250కోట్ల వరకు అవసరమని గుర్తించారు. అలాగే భూపాలపల్లి జిల్లా కాటారంలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తికి రూ.350కోట్లు అవసరమని భావిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ పనులు కూడా జరుగుతున్నాయి. అలాగే సరిహద్దులో ఉన్న ములుగు జిల్లా వాజేడు మండలం కిష్టాపూర్ అడవుల్లోని మోడికుంట ప్రాజెక్టును కూడా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు చేశారు. 19ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ మోడికుంట ప్రాజెక్టుకు రూ.500.25కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి అనుమతుల కోసం కేంద్ర జలసంఘం (సీడబ్ల్యుసీ)కి పంపారు. ఈ క్రమంలో మోడికుంటకు కూడా నిధులు కేటాయించే అవకాశం కనిపిస్తోంది. ములుగు జిల్లా పాలెంవాగు ప్రాజెక్టును గత ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించింది. అయితే డిస్ట్రిబ్యూటర్ కెనాళ్లు, పిల్ల కాలువలు పూర్తవకపోవడంతో రైతులకు సాగునీరందటం లేదు. పాలెంవాగు ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు రూ.125కోట్ల వరకు అవసరంగా గుర్తించారు. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారనే ఆశతో ఉన్నారు. అలాగే దేవాదుల నుంచి రామప్ప చెరువులోకి నీటిని ఎత్తిపోసి అక్కడి నుంచి పాకాల, లక్నవరం చెరువుల్లోకి నీటిని తరలించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సుమారు 32వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే పాకాల వరకు దేవాదుల నీళ్ల ఎత్తిపోసే పనులు పూర్తయినా రామప్ప నుంచి లక్నవరం వరకు నీటిని ఎత్తిపోసే పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా 103.31ఎకరాల భూసేకరణ సమస్యగా మారింది. లక్నవరం వరకు గ్రావిటీ కెనాల్ పనులు పూర్తి చేయాలని సూచించారు. సుమారు రూ.61కోట్లు కేటాయిస్తే పనులు పూర్తి అవుతాయని అంచనా. వీటితో పాటు మరికొన్ని మైనర్ ప్రాజెక్టులకు కూడా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలోని మరికొన్ని..

- మహబూబాబాద్ జిల్లా మల్యాల కృషి విజ్ఞాన కేంద్రాన్ని(కేవీసీ) ఉద్యాన యూనివర్సిటీగా మార్చాలనే డిమాండ్ ఉంది. 1998 నుంచి ఇక్కడి రైతులు ఉద్యాన యూనివర్సిటీ కోసం ఆందోళనలు చేస్తున్నారు. బడ్జెట్‌లో మహబూబాబాద్ రైతుల కల నేరవేరుతుందా అనే ఆశతో ఎదురుచూస్తున్నారు.
- జనగామ జిల్లా కల్లెం టెక్స్‌టైల్ పార్కు కోసం గత ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. 2019లో అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ చొరవతో పనుల్లో కదిలిక వచ్చింది. పార్కులో మౌళిక సదుపాయలు కల్పించాలి. 40మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారు. పూర్తి స్థాయిలో నిధులు లేకపోవటంతో ఆశించిన స్థాయిలో పరిశ్రమలు రావటం లేదు.
- కొడకండ్ల మినీ టెక్స్‌టైల్ పార్కు కోసం 2020-21లో భూమిని పరిశీలించారు. కానీ ప్రత్యేకంగా నిధులు కే టాయింపులు లేకపోవటంతో అడుగులుపడటం లేదు.
- ములుగు జిల్లా మంగపేటలో బిల్ట్ ఫ్యాక్టరీని పూర్తిగా మూసేసి ఐటీసీ కంపెనీకి లీజుకు ఇచ్చారు. ఈ ప్రాంతంలో కొత్త ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే గిరిజనులకు ఉపాధి అవకాశాలు ఏర్పాటవుతాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తుందన్న ఆశతో ఉన్నారు.
- యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం కింద రూ.60 కోట్లు కేటాయించి పనులు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాలయాల పునరుద్ధరణకు రూ.25కోట్ల వరకు కేటాయిస్తామని ప్రకటించిన నిధులు విడుదలలో జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పైసా నిధులు కేటాయించలేదు. బడ్జెట్‌లో రామప్ప అభివృద్ధికి నిధులు కేటాయిస్తారనే ఆశతో ఉన్నారు.
- హనుమకొండ జిల్లా మడికొండలో వీవర్స్ పార్కు అభివృద్ధికి చేయూతనిచ్చేలా ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారనే ఆశతో చేనేత కార్మికులున్నారు.
- వరంగల్ మహానగరంలో ఐటీ టవర్లను తీసుకరావటంతో పాటు కొత్త పరిశ్రమలు వచ్చేలా నిధులు కేటాయింపులు ఉంటాయని ఆకాంక్షిస్తున్నారు.
- వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి నిధుల కొరత ఉంది. ఇటీవల సీఎం సైతం ఈ ఆస్పత్రిని పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తారని భావిస్తున్నారు.
- వరంగల్ జైలును 2021 జూన్ 1న కూల్చేసి ఆస్పత్రిని నిర్మించారు. మామునూరులో రూ.250కోట్ల వ్యయంతో అత్యాధునిక జైలును నిర్మిస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. అయితే నిధుల కొరతతో జైలు పనులు ముందుకు సాగటం లేదు.
- ఖిలా వరంగల్ కోటను మరింత అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని నగరవాసులు, పర్యాటకులు ఎదురు చూస్తున్నారు.
- భూపాలపల్లిలో సింగరేణి కార్మికులు అత్యధికంగా ఉండటంతో ఇక్కడ మైనింగ్ విద్యాలయంతో పాటు ఇంజనీరింగ్ కాలేజీ కూడా ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపుతుందనే ఆశతో ప్రజలున్నారు.

నాణ్యత ప్రమాణాలను పొందుపరచాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 24 : ట్రాన్స్‌ఫార్మర్లలో వైఫల్యాలను తగ్గించడానికి కొనుగోళ్లలో నాణ్యత ప్రమాణాలు పొందపరచాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి సూచించారు. సీజీయంలు, జీయంలతో సీఎండీ బుధవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఎస్పీఎం షెడ్లలలో నాణ్యత ప్రమాణాలతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు పెంచాలన్నారు. ఎల్కతుర్తి ఎస్పీఎం షెడ్డును అధునాతన సాంకేతికత పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సబ్‌స్టేషన్‌లను సమర్థవంతంగా నిర్వహించేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్‌ను పాటించాలన్నారు. లెంథీ లైన్‌ల మధ్య సమస్యలను పరిష్కరించడానికి ములుగు, నర్సంపేట ఏరియాలో ప్రతీ 4 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు పెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సిజీయంలు కిషన్, రాజు చౌహాన్, కె.ఎన్.గుట్ట, జీయంలు గౌతమ్‌రెడ్డి, నాగప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందరూ ప్రకృతి జీవన విధానాన్ని అలవర్చుకోవాలి

- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి



రిజిస్ట్రార్ మల్లారెడ్డిని సన్మానిస్తున్న ప్రొఫెసర్ రామేశ్వరం తదితరులు

కేయూ క్యాంపస్, జూలై 24 : భారతీయ జీవన విధానంలో ప్రకృతి జీవన విధానం అత్యుత్తమైందని అందరూ అలవర్చుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని కేయూ రిటైర్డు ప్రొఫెసర్ గుజ్జుల రామేశ్వరం నిర్వహిస్తున్న రామేశ్వరం ఇంటర్నేషన్ నాచురోపతి లైబ్రరీ రిసెర్చ్ సెంటర్ 6వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశం ప్రపంచ దేశాలకు ఎంతో ప్రకృతి విజ్ఞానాన్ని ఇచ్చిందన్నారు. ప్రకృతితో సహజీవనంలో వ్యాధులు, రోగ నివారణకు ఆయుర్వేదం, యోగా, సిద్దా, యునాని, హోమియో ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు. పాశ్చాత్య దేశాల జీవన విధానం, ఆహారపు అలవాట్లను మానుకోవాలని చెప్పారు. ప్రొఫెసర్ రామేశ్వరం విలువైన గ్రంథాలను సేకరించి సొంత ఖర్చులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీలో ఆయుర్వేద లైబ్రరీని అనుసంధానం చేసేందుకు ఆలోచిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మల్లారెడ్డిని రామేశ్వరం శాలువ, జ్ఞాపిక అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రొఫెసర్లు గిరీశం, సత్యనారాయణ, విద్యాసాగర్‌రెడ్డి, లక్ష్మణాచారి, రాజ్ మహ్మద్, ఆర్‌జే ప్రసాద్, డాక్టర్ రఘురామయ్య, జర్నలిస్టు చిలుముళ్ల సుధాకర్ పాల్గొన్నారు.

కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు 31

కేయూ క్యాంపస్, జూలై 24 : కాకతీయ యూనివర్సిటీలోని అన్నివిభాగాల ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజులను ఎటువంటి అపరాధ రుసుం లేకుండా జూలై 31 వరకు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్, ఆర్ట్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, సోషల్ సైన్స్, ఎడ్యుకేషన్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ తదితర పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్గిన విద్యార్థులను ఫీజులను చెల్లించుకోవాలని కోరారు. రూ.250 అపరాధ రుసుంతో ఆగస్టు 7 వరకు ఫీజులు చెల్లించుకునేందుకు అవకాశంఉందన్నారు.

1 నుంచి కేయూలో ఇంగ్లీష్ తరగతులు

కేయూ క్యాంపస్, జూలై 24: కేయూ సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో 40 రోజులు పాటు స్పోకెన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణ తరగతులు ఆగస్టు 1 నుంచి నిర్వహిస్తామని సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 1500ఇతరలకు, రూ.100 క్యాంపస్ విద్యార్థులు క్లాస్‌లకు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన వారు కేయూ క్యాంపస్‌లోని ఇంగ్లీష్ విభాగంలో సంప్రదించాలని కోరారు. ఆగస్టు 1నుంచి ప్రతీ రోజు సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గంజాయి పీలుస్తున్న ఇద్దరు యువకుల అరెస్టు

వరంగల్ క్రైం, జూలై 24 : గంజాయి పీలుస్తున్న ఇద్దరు యువకులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రవిందర్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం పెట్రోలింగ్ చేస్తుండగా గుండ్లసింగారం కెనాల్ వద్ద చెట్ల పొదల్లో కె.రాహుల్, పి.రవిందర్ అనే ఇద్దరు యువకులు సిగరెట్లు తాగుతూ కనిపించారు. అనుమానం వచ్చి వారిని పట్టుకుని ప్రశ్నించగా కాజీపేట వద్ద గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయి కొనుక్కుని తాగుతున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిందర్ తెలిపారు. పట్టుబడిన వారిలో రాహుల్ హసన్‌పర్తి మండలం ముచ్చర్ల వాసి కాగా రవిందర్ ఏటూర్‌నాగారం మండలం కమలాపూర్ గ్రామస్థుడు.

అన్నదాతలను మోసగిస్తున్న కాంగ్రెస్

- రైతుబంధు పైసలు రుణమాఫీకి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర (మహబూబాబాద్ జిల్లా), జూలై 24 : రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. పెద్దవంగర మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని నమ్మించి , కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, ఇప్పుడు రుణమాఫీకి అనేక ఆంక్షలు, కొర్రీలు పెట్టి ఆగం ఎందుకు చుస్తున్నదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని, మోసపూరితమని ధ్వజమెత్తారు. రుణమాఫీ పేరిట రాష్ట్ర రైతాంగాన్ని రైవంత్ సర్కార్ మోసం చేస్తున్నదని ధ్వజమత్తారు. రైతులకు జూన్‌లో ఇవ్వాల్సిన రైతు బంధు నిధుల్లోంచి రూ.7000 కోట్లు దారిమళ్లించి వాటిని రుణమాఫీగా అందిస్తున్నామని చెబుతూ రేవంత్ సర్కార్ పొజులు కొడుతున్నదని దుయ్యబట్టారు. రైతలకు హక్కుగా రావాల్సిన రైతు బంధు డబ్బు నుంచి కొంత మొత్తాన్ని విదిల్చి రుణమాఫీగా ఇస్తున్నట్లు చెప్పుకోవడం దారుణమని మండిపడ్డారు. రైతుల జీవితాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదని, రైతులందరికీ రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ చేతుల్లో పెట్టడంతో ప్రజలు కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రతీ రైతును ఆదుకున్నామని, సబ్బండవర్గాలకు అండగా నిలిచామని తెలిపారు. కాంగ్రెస్ రాగానే కరువు, కష్టాలు, కరెంట్ కోతలు మళ్లీ మొదలైనట్లు వివరించారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి.రామచంద్రయ్యశర్మ, శ్రీరాం సంజయ్, శ్రీరాం సుధీర్, వెంకన్న, రాసాల సమ్మయ్య, శ్రీరాం రాము, వెంకట్రామయ్య, చింతల భాస్కర్‌రావు, శ్రీనివాస్ రవి, అనుదీప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

13 మంది ఏఎస్ఐలు బదిలీ

- 44 మంది కానిస్టేబుళ్లకూ స్థానచలనం

వరంగల్ క్రైం, జూలై 24 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న 13 మంది ఏఎస్ఐలు, 4 కానిస్టేబుళ్లు, 40 మంది హెడ్ కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. బుధవారం కౌన్సెలింగ్ పద్ధతిలో ఆయా పోలీస్ స్టేషన్‌లకు కేటాయిస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు, ఎల్లుండి భద్రాద్రి జోన్ స్టాఫ్‌నర్సుల బదిలీల కౌన్సెలింగ్

గిర్మాజీపేట, జూలై 24 : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సాధారణ బదిలీల్లో భాగంగా సీనియారిటీ జాబితాలో అక్రమాలు జరిగాయన్న కారణంగా వాయిదాపడిన స్టాఫ్ నర్సుల బదిలీల కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజైన బుధవారం జోన్ 1 (కాళేశ్వరం) కౌన్సెలింగ్ ఉదయం 9 గంటలకు, జోన్ 2(బాసర) కౌన్సెలింగ్ మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్ వెంగళరావునగర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వేల్ఫేర్ (ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ)లో జరిగింది. ఇక జోన్ 4 (భద్రాద్రి) పరిధిలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన స్టాఫ్‌నర్సులకు 26, 27 తేదీల్లో నారాయణగూడాలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) కౌన్సెలింగ్ జరగనుంది. ఇందులో భాగంగా బదిలీ జాబితాలోని సీరియల్ నెంబర్ 1 నుంచి 125 వరకు 26వతేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు, సీరియల్ నెంబర్ 126 నుంచి 250 వరకు మధ్యాహ్నం 1 గంటకు కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రజారోగ్యశాఖ విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొంది. మరుసటి రోజు శనివారం ఉదయం 9 గంటలకు సీరియల్ నెంబర్ 251 నుంచి 375 వరకు, మధ్యాహ్నం 1 గంటకు సీరియల్ నెంబర్ 376 నుంచి చివరి నెంబర్ వరకు కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించింది. అలాగే మల్టీజోన్ 1 హెడ్‌నర్సుల కౌన్సెలింగ్ 30వ తేదీ ఉదయం 9గంటలకు మల్టీజోన్ 2 హెడ్‌నర్సులకు, మధ్యాహ్నం 1 గంటకు నారాయణగూడలోని ఐపీఎంలో కౌన్సెలింగ్ జరగనుంది.

13 నుంచి దూరవిద్య బీఎల్ఐసీ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూలై 24 : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు13 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 13, 16, 19, 21 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాల, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఎస్డీఎల్‌సీఈ బీఎల్ ఐఎస్సీ ఇయర్‌వైజ్ ఓల్డ్ అభ్యర్థులకు ఆగస్టు 13, 16, 19, 21, 23, 27, 29 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

27న విద్యుత్ పోల్ క్లైంబింగ్ పరీక్ష

హనుమకొండ టౌన్, జూలై 24 : హై కోర్టు ఆదేశానుసారం ఉమ్మడి వరంగల్‌లో జూనియన్ లైన్‌మెన్‌కు అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 27న ములుగు రోడ్డులోని ఉత్తర విద్యుత్ శిక్షణ సంస్థ (ఎన్‌పిటిఐ)లో ఉదయం 9 గంటలకు విద్యుత్ పోల్ క్లైంబింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు హనుమకొండ ఎస్ఈ కె. వెంకటరమణ తెలిపారు. అభ్యర్థులకు ఇప్పటికే వ్యక్తిగతంగా సమాచారం ఇవ్వడం జరిగిందని, అభ్యర్థుల జాబితాను హనుమకొండ సర్కిల్ ఆఫీస్‌లో సైతం అందుబాటులో ఉందన్నారు.

సమాజ సేవలోనే సంతృప్తి



ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు

జనగామ కల్చరల్, జూలై 24: సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వచ్చే సంతృప్తి వెలకట్టలేనిదని లయన్స్ జిల్లా 320ఎఫ్ మొదటి ఉపగవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం క్లబ్ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్‌బాబు అధ్యక్షతన 23వ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ అధ్యక్షునిగా గాదె నర్సింహులు, కార్యదర్శిగా వేణుగోపాల్‌రెడ్డి, కోశాధికారిగా బండ బిక్షపతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రెండవ ఉపగవర్నర్ నరహరి సుధాకర్‌రెడ్డి, పూర్వ గవర్నర్ కన్నా పరశురాములు, ఏనుగు నర్సిరెడ్డి, దాసరి సుమన్, చందుపట్ల రవీందర్‌రెడ్డి, శ్రీరామ్ శ్రీనివాస్, ఎలికట్టె నరేందర్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

'యాత్రను జయప్రదం చేయాలి'

లింగాలఘణపురం, జూలై24: ఆగస్టు 2 నుంచి 8 వరకు కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన 'అమరుల యాదిలో' రాష్ట్ర సామాజిక చైతన్య యాత్రను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల్నె వెంకటమల్లయ్య పిలుపునిచ్చారు. బుధవారం లింగాలఘణపురంలో ఆయన మాట్లాడుతూ గీత కార్మికులు మరణించినా శాశ్వత వైకల్యం పొందినా రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా లింగాలఘణపురం మండల కల్లుగీతకార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బస్వగాని మహేందర్, ప్రధానకార్యదర్శిగా కూటికంటి రమేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వడ్లకొండ వెంకటేశ్, సమ్మయ్య, సత్యనారాయణ, శ్రీధర్, రమేశ్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

తహసీల్దార్‌కు బీజేపీ నేతల వినతి

జఫర్‌గడ్, జూలై 24: రాష్ట్రంలోని బీసీల సంక్షేమం కోసం డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ మండల కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ నాయకులు బుధవారం జఫర్‌గడ్ తహసిల్దార్ అంబటి ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, జిల్లా నాయకులు గడ్డం రాజు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో మెజార్టీగా ఉన్న బీసీ కులాలను కాంగ్రెస్ ప్రభుత్వం తన అవసరాలకు వాడుకుంటోందే తప్ప ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీల అభివృద్ధి కోసం కమిషన్‌ను ఏర్పాటు చేసి.. నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్‌ను 23 శాతం నుంచి 43 శాతంకు పెంచుతామని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం బీసీలను ఆదుకునేందుకు డిక్లేరేషన్‌ను అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రేమ్‌కుమార్, మేరుగు రామరాజు, పందిబోయిన యాదగిరి, సింగారపు రమేశ్, పందిబోయిన రాజు, గోదారి సాయిరాం, తాళ్లపల్లి సురేశ్ గౌడ్, గాదెపాక శ్వేత, పిట్ట రాజు, రాజేష్, మూల యాకయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లావాసుల ఆశలు

- పాలిటెక్నిక్, నర్సింగ్ కాలేజీకి మోక్షం దక్కేనా?
- టెక్స్‌టైల్, ప్రాసెసింగ్ పార్కులను ప్రస్తావించేనా!





ఖిలాషాపూర్ కోట, దేవరుప్పుల మండలం మన్‌పహాడ్‌లోని ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు ప్రతిపాదిత స్థలం

జనగామ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై జిల్లా వాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఏళ్లుగా ఉన్న సమస్యలు, అభివృద్ధి పనులు, కొత్త హామీలపై ప్రస్తావన, నిధులు కేటాయింపులు ఏ మేరకు ఉంటాయేమోనని ఎదురు చూస్తున్నారు. జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయింపులు జరగాలని కోరుకుంటున్నారు. జిల్లా ఏర్పాటుకు ముందు నుంచే జనగామలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు ఉన్నాయి. ఈ క్రమంలో 2018 ఎన్నికల ప్రచారం సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ జనగామలో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 2022లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కానీ నర్సింగ్, పాలిటెక్నిక్ కాలేజీల విషయంలో నిర్లక్ష్యం చూపారు. కాగా.. ప్రస్తుత ప్రభుత్వం జిల్లావాసుల చిరకాల డిమాండ్ అయిన నర్సింగ్, పాలిటెక్నిక్ కాలేజీని ఏర్పాటు చేసేలా బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశిస్తున్నారు.

'పర్యాటకం'పై దృష్టి పెట్టేనా!

చారిత్రాక నేపథ్యమున్న జనగామ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఎన్నో పోరాటాలకు, బహుజన వాద ఉద్యమాలకు కేంద్రబిందువైన ప్రాంతం. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ లాంటి తెలంగాణ సాయుధ పోరాట వీరులకు జన్మనిచ్చిన గడ్డ ఇది. బహుజనులకే రాజ్యాధికారం దక్కాలన్న కాంక్షతోనే వందల ఏళ్ల క్రితమే పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న పుట్టిన ఖిలాషాపూర్‌లోని కోట, జఫర్‌ఘడ్ కోట, తాటికొండ కోటలను మరింతగా అభివృద్ధి చేయాల్సి ఉంది. గత ప్రభుత్వంలో పర్యాటకానికి రూ. 40 కోట్లను కేటాయించారు. ఇందులో పాలకుర్తి సోమేశ్వర కళాక్షేత్రం, బమ్మెర పోతన సమాధి అభివృద్ధి, పోతన కళాక్షేత్రం, వల్మిడిలో కళాక్షేత్రం, కాటేజీల నిర్మాణానికి రూ. 22 కోట్లు, పెంబర్తి హస్తకళలు, ఖిలాషాపూర్, జఫర్‌ఘడ్ కోటల అభివృద్ధికి కలిపి రూ. 13 కోట్లు కేటాయించారు. ఇందులో కొన్ని పనులు పూర్తవగా మరికొన్ని పనులు నిర్మాణ దశలోనే ఉన్నాయి. దీంతో పాటు జఫర్‌ఘడ్, ఖిలాషాపూర్ కోటల పునరుద్ధరణకు మరిన్ని నిధులు కావాల్సిన అవసరం ఉంది.

టెక్స్‌టైల్, ప్రాసెసింగ్ పార్కుల మాటేమిటి?

జిల్లాలో టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. లింగాలఘనపురం మండలం కళ్లెం శివారులో 2009లో పురుడు పోసుకున్న టెక్స్‌టైల్ పార్కు నేటికీ ప్రారంభం కాలేదు. 15 ఏళ్లుగా ఆగుతూ.. సాగుతూ నిరుద్యోగులను ఊరిస్తోంది.

జిల్లాలోని కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని 2022లో అప్పటి జౌళిశాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. దీనికి సంబంధించి స్థల సేకరణ చేసి వదిలేశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో లెదర్ పార్కు ఏర్పాటు చేయాలనే డిమాండ్ 20 ఏళ్లుగా ఉంది. దీనికి సంబంధించి ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కొంత ప్రస్తావన వచ్చింది. కానీ పనులు మాత్రం కార్యరూపం దాల్చలేదు. అలాగే దేవరుప్పుల మండలం మన్‌పహాడ్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నష్కల్, తరిగొప్పుల మండలకేంద్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను ఏర్పాటు చేస్తామంటూ గత ప్రభుత్వం స్థల పరిశీలన చేసింది. కానీ.. అదీ ముందుకు సాగడం లేదు. వీటిపై ఈ బడ్జెట్‌లో ప్రస్తావన అంటుందని ప్రజలు ఆశిస్తున్నారు.

బ్యాంకు సిబ్బందికి సహకరించండి: కలెక్టర్



సింగరాజుపల్లిలో రైతుతో చర్చిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

దేవరుప్పుల, జూలై 24: రైతు రుణమాఫీ అమలు చేసే విషయంలో బ్యాంకు సిబ్బందికి సహకరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా రైతులకు సూచించారు. బుధవారం ఆయన సింగరాజుపల్లిలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకును సందర్శించారు. బ్యాంకులో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా మూడు రోజులుగా నిలిచిపోయిన సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో సింగరాజుపల్లికి చెందిన దాసగోని భిక్షపతి అనే రైతు తనకు రుణమాఫీ కాలేదని తెలుపగా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఏవో వినోద్ కుమార్, తహసీల్దార్ హుస్సేన్, ఏవో వెంకటేశ్వర్లు, ఏఈవో సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గురుకుల జోనల్ ఆఫీసర్..

జనగామ కల్చరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులానికి కొత్తగా వచ్చిన జోనల్ ఆఫీసర్ విద్యారాణి బుధవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కళాశాలకు చేరుకున్న విద్యారాణికి ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాసంబంధ విషయాలపై దృష్టి సారించాలని కోరారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. విద్యార్థులు రాయడం, చదవడంపై శ్రద్ధ పెట్టాలన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 24: వివాహం చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన మేకల లక్ష్మణ్ అనే యువకుడికి యాదాద్రి భువనగిరి జిల్లా, అలేరుకు చెందిన యువతి కొన్ని నెలల క్రితం ఫోన్‌లో పరిచయ మైంది. అప్పటినుంచి యువతితో తరచుగా ఫోన్‌లో మాట్లాడుతూ ఆమె వివరాలు తెలుసుకున్నాడు. హైదరాబాద్‌లోని మౌలాలి హౌసింగ్ బోర్డులో తల్లిదండ్రు లతో కలిసి ఉంటున్న విషయం తెలుసుకొని ఈ నెల 19న లక్ష్మణ్ అక్కడికి వెళ్లాడు. వివాహం చేసకుంటానని నమ్మించి ఆమెను తీసుకొని అదే రోజు రాత్రి స్టేషన్ ఘన్‌పూర్‌కు వచ్చాడు. తిరిగి 20వ తేదీన చర్లపల్లి స్టేషన్‌కు తీసుకువెళ్లాడు. ఆ రాత్రి స్టేషన్ సమీపంలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో యువతితో గడిపాడు. 21వ తేదీ ఉదయం యువతిని మౌలాలి వద్ద వదిలివేసి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకొని సతీష్ స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. యువతి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు ఈనెల 23వ తేదీన అలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు కేసును ఘన్‌పూర్ పోలీసులకు అప్పగించారు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన ఘన్‌పూర్ పోలీసులు బుధవారం నిందితుడు లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. యువతిని నమ్మించి మోసం చేసినందున సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్కు రాజు తెలిపారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

చిలుపూర్, జూలై 24 : చిలుపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామని, త్వరలోనే ఏకీకృత సర్వీస్‌రూల్స్‌ను అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో పాటు, ప్రతీ పాఠశాలకు స్కావెంజర్లను నియమించేందుకు కృషి చేస్తామని అన్నారు. అంతకుముందు ఆయన బుగులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కొల్ల మహిపాల్ రెడ్డి, దాసి శ్రవన్‌కుమార్, అశోక్, విజేందర్‌రెడ్డి, రాంబాబు, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రవీన్, రఘు, జయప్రకాశ్, వేణు, అనిత, జుబేదాబేగం తదితరులు పాల్గొన్నారు.

రేపు మేడిగడ్డకు బీఆర్ఎస్ బృందం

కేటీఆర్, హరీశ్‌రావు సహా ఎమ్మెల్యేల రాక

కాటారం (మహదేవపూర్ రూరల్), జూలై 24: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌లను పరిశీలించేందుకు బీఆర్ఎస్ బృందం శుక్రవారం రానుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు రానున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ఉదయం 9గంటలకు కన్నెపల్లి పంప్‌హౌస్‌కు నేతలు చేరుకుంటారు. అనంతరం 10.30గంటలకు మీడియాతో మాట్లాడతారు. 11.30గంటలకు మేడిగడ్డ బ్యారేజీ చేరుకుంటుంది. అక్కడి నుంచి బయల్దేరి మంచిర్యాల జిల్లా చెన్నూరుకు వెళ్తారు.

'ఎమ్మార్పీఎస్ గద్దెలు నిర్మించాలి'

జనగామ రూరల్, జూలై 24: ప్రతీ గ్రామంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జెండా గద్దెలు నిర్మించాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో జెండా గద్దెలను నిర్మించి కమిటీలను వేయాలన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా చంద్రమోహన్

కొడకండ్ల జూలై 24 : కొడకండ్ల తహసీల్దార్ చిలుకల అంజయ్య వికారాబాద్‌కు బదిలీ కాగా కార్యాలయ సిబ్బంది బుధవారం ఆయనకు శాలువా కప్పి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కాగా, ఆయన స్థానంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ప్రస్తుత డిప్యూటీ తహసీల్దార్ కోల చంద్రమోహన్ బాధ్యతలు స్వీకరించారు.

సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన

రఘునాథపల్లి, జూలై 24: కుర్చపల్లి గ్రామంలో నూతన సబ్-స్టేషన్ నిర్మాణం కోసం ఎన్‌పీడీసీఎల్ అధికారులు బుధవారం స్థల పరిశీలన చేశారు. గ్రామంలోని 116, 117 సర్వే నెంబర్‌లో గల ఎకరం స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మించడానికి రూ.2.26 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని వారు తెలిపారు.

రుణమాఫీపై ఆర్డీవో పరిశీలన

రఘునాథపల్లి, జూలై 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ అమలుపై జనగామ ఆర్డీవో కొమురయ్య బుధవారం మండల కేంద్రంలోని ఏపీజీవీబీ, ఎస్‌బీఐ బ్యాంకులను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ మైనావతి, ఏపీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్ తిమ్మప్ప, అకౌంట్ ఆఫీసర్ బుచ్చయ్యతో మాట్లాడి రుణమాఫీకి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. రైతు రుణమాఫీ నగదు రైతులకు సకాలంలో అందేటట్లు చూడాలని ఆర్డీవో కొమురయ్య బ్యాంకు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పురం యుగేందర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎవో కాకి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

పాలకుర్తి: ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని డీఆర్‌డీవో పీడీ, మండల ప్రత్యేకాధికారి మొగులప్ప సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రతీ బుధవారం అంగన్‌వాడి కేంద్రాలను, గురువారం ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయాలని, ఈ నెల 31 వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ఏపీవో మంజులకు సూచించారు.

సెయింట్ మేరీస్ హైస్కూల్‌పై ఫిర్యాదు

జనగామ రూరల్, జూలై 24: సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, హాస్టల్‌లో కనీస వసతులు కూడా కల్పించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న హైస్కూల్‌పై ప్రభుత్వం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుంటపల్లి కార్తీక్, మహేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.







దేవరుప్పులలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఘన్‌పూర్‌లో కేటీఆర్ బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య, హైదరాబాద్‌లో కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

దేవరుప్పుల, జులై 24: ఐటీ శాఖ మాజీ మంత్రి, ప్రస్తుత సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామరావు జన్మదిన వేడుకలను బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు కేక్ తినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడు నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. రైతుబంధును ఎత్తేశారని, సగం మందికే రుణమాఫీ చేశారని అన్నారు. త్వరలోనే ప్రజల నుంచి పెద్ద ఎత్తున నిరసన వస్తుందని, అప్పటి వరకు కార్యకర్తలు నిశ్శబ్దంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లా సుందర్‌రాంరెడ్డి, బస్వ మల్లేశం, చింత రవి, కొల్లూరి సోమన్న, యేల సోమసుందర్, అనంతోజు కృష్ణమూర్తి, జేరిపోతుల సాయిలు, తీగల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన యూత్ ఐకాన్ కేటీఆర్ అన్నారు. రానున్న రోజుల్లో దేశం గర్వించేనేతగా కేటీఆర్ ఎదుగుతారని కొనియాడారు. కార్యక్రమంలో ఆకుల కుమార్, లకావత్ చిరంజీవి, మహేందర్ రెడ్డి, కనకం గణేష్, తాటికొండ సురేష్, ఓగ్గు రాజు, మారపల్లి ప్రసాద్, గుండె మల్లేషం, ఇనుగాల నర్సింహరెడ్డి, పొన్నం రంజిత్‌గౌడ్, చందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనగామ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వ్యక్తిగతంగా, రాజకీయంగా కేటీఆర్ మరింతగా రాణించాలని పల్లా ఆకాంక్షించారు.

జనగామ రూరల్: కేటీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్‌యస్ నాయకుడు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ సమీపంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సౌడ మహేష్, సుల్తాన్, గోవింద్ రెడ్డి, కొలనుపాక శివరాజు, ఫయాజ్, తంగ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: కేటీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ పరిపాలనధ్యక్షుడుగా కేటీఆర్‌కు మంచి పేరుందన్నారు. కార్యమ్రంలో పుస్కూరి శ్రీనివాస్, పాము శ్రీనివాస్, సర్వర్‌ఖాన్, గణేష్ పాల్గొన్నారు.

లింగాలఘణపురం: నెల్లుట్లలో బీఆర్ఎస్ నాయకుడు నల్ల రాహుల్ ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో నల్ల మైసయ్య, నల్ల లక్ష్మయ్య, వంగ సతీష్, లింగమూర్తి, మల్లికార్జున్, స్వామి, సుధాకర్, కుమార్ పాల్గొన్నారు.

కొడకండ్ల: కేటీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయంలో మండలశాఖ అధ్యక్షుడు సింధె రామోజీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.గాంధీనాయక్, డి.వెంకటేశ్వర్‌రావు, మేటి సోమరాములు, డి.రాజ్‌కుమార్, డి.మహేష్, మల్లేష్, డి.వెంకన్న పాల్గొన్నారు.

నర్మెట: కేటీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు చౌరస్తాలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చింతకింది సురేష్, తేజావత్ గోవర్ధన్, మాలోతు శ్రీనివాస్, ఆమెడపు కమలాకర్‌రెడ్డి, నీరటి సుధాకర్, నక్కల రవి, పాతూరి తిరుపతిరెడ్డి, బెడుదం సుధాకర్ పాల్గొన్నారు.

చిలుపూర్: కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా చిన్నపెండ్యాలలో పార్టీ మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి నేతృత్వంలో నిర్వహించిన వేడుకలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడవెళ్లి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యకర్తల సమక్షంలో కేక్ కోసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల రాజన్‌బాబు, మోటం రాములు, తాళ్ళపల్లి క్రాంతికుమార్, మంతెన రాజు, గుంపుల రవిందర్‌రెడ్డి, వెన్నం మాధవరెడ్డి, తాళ్ళపల్లి జగన్నాథం, నిరంజన్‌రెడ్డి, శాగ వెంకటేశ్వర్లు, గడ్డం మహేందర్, సుగ్రీవచారి, బోగం రాజేందర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

బచ్చన్నపేట: కేటీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పులిగిళ్ల పూర్ణచందర్, ఇర్రి రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు వడ్డేపల్లి మల్లారెడ్డి, గంధమాల నరేందర్, పందిపెల్లి సిద్ధిరాంరెడ్డి, ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, కర్నాల వేణు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

బదిలీలు సహజం.. జ్ఞాపకాలు పదిలం

ఉద్యోగుల వీడ్కోలు సమావేశంలో చైర్‌పర్సన్ యాస్మిన్ సుల్తానా



ధర్మకంచ ఉన్నత పాఠశాలలో సన్మాన గ్రహీతలతో చైర్‌పర్సన్ యాస్మిన్ సుల్తానా

జనగామ కల్చరల్, జూలై 24: ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని, పని చేసిన కాలంలో విద్యార్థుల మదిలో మన జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ యాస్మిన్ సుల్తానా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా యాస్మిన్ సుల్తానా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఇతర పాఠశాలలకు వెళ్లినప్పుడు విద్యార్థులు బాధపడడం సహజమన్నారు. వారు పాఠశాలలో ఉన్నప్పుడు చెప్పిన మంచి మాటలు విద్యార్థుల మదిలో జ్ఞాపకాలుగా చిరకాలం ఉంటాయన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నర్సింహులు, బాలరాజు, మారుతిప్రసాద్, నీరజ, లింగారెడ్డి, శ్రీవేణి, రాములు, భవాని, ఆరీఫ్‌ను ఘనంగా సన్మానించారు. అదే విధంగా నూతనంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు కరుణ, చంద్రశేఖర్‌రావు, రమేష్, లింగం, చంద్రకళ, నిర్మల, లలిత, విజయకుమార్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భూపతి, నరేందర్, శేషుకుమార్, లక్ష్మీ, ఉమాదేవి, తహెరా జహాన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లా ట్రెజరీ కార్యాలయ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి చంద్రకళ నర్సంపేట ట్రెజరీ కార్యాలయానికి బదిలీ కాగా బుధవారం జిల్లా కేంద్రంలో ఆమెకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. డీఈవో కె.రాముతో పాటు, జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. అనంతరం చంద్రకళను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మెర్గు రామరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జఫర్‌గడ్: విద్యా బోధనలతో విద్యార్థులు అభ్యున్నతి సాధించడమే ఉపాధ్యాయుల లక్ష్యం కావాలని జఫర్‌గడ్ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పద్మ గీతారెడ్డి అన్నారు. సుదీర్ఘ కాలం పని చేసి హైస్కూల్ నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు చాడ గణేష్‌రెడ్డి, సుష్మితలను బుధవారం ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పద్మ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది.. గౌరవమైనదని అన్నారు. ఎక్కడ పని చేసినా వృత్తి నిబద్ధత, సామాజిక బాధ్యతలతో విధులను నిర్వర్తిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడాలని కోరారు. ప్రతీ రోజు పాఠశాలకు హాజరై.. గురువుల బోధనలను అవగాహన చేసుకుని ఉత్తమ ఫలితాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ రేణుక, మాజీ చైర్మన్ గాదె పుష్పారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదేవిధంగా బదిలీపై నల్గొండ జిల్లాకు వెళుతున్న జఫర్‌గడ్ తహసిల్దార్ అంబటి ఆంజనేయులును బుధవారం పలు పార్టీల నేతలు సన్మానించారు. మాజీ ఎంపీపీ రడపాక సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు ఇల్లందుల శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య, కాట సుధాకర్, గుండెబోయిన రాజు, తదితర నేతలు శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. ఇంతకాలం వారు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించారని ప్రశంసించారు.

'కేసులు ఎత్తివేయాలి'

జనగామ రూరల్, జూలై 9: జనగామ జిల్లా సాధన ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని బీజేపీ నాయకుడు, జిల్లా ఉద్యమకారుడు ఉడుగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగామ జిల్లా సాధన ఉద్యమ కేసులో భాగంగా బుధవారం వారు కోర్టులో హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జనగామ జిల్లా సాధన కోసం పోరాడిన ఉద్యమకారులపై పోలీస్‌లు అక్రమంగా కేసులు పెట్టి 8 సంవత్సరాల నుంచి కోర్టు చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే జిల్లా ఉద్యమకారులపై కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కోర్టుకు హాజరైనవారిలో మంతెన మణి కుమార్, మంగళంపల్లి రాజు, తిప్పారపు ఉపేందర్, పిట్టల సురేష్, తీగల సిద్దుగౌడ్, ఎండీ మాజీద్, సతీష్ ఉన్నారు.

ప్రమాద రహిత వారోత్సవాలు

జనగామ రూరల్, జూలై 24: జనగామ ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలను బుధవారం జనగామ ఎస్సై చెన్నకేశవులు, జనగామ డిపో మేనేజర్ ఎస్ స్వాతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, అతివేగం, నిర్లక్ష్యంతో వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. బస్సులను రోడ్లపై అడ్డంగా నిలుపరాదని పక్కకు ఆపి ప్రయాణికులకు ఎక్కించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మెనేజర్ హుస్సేన్, అధికారులు బి.అజయ్, యాదమణి రావు, ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.